క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లవరం: బెండమూర్లంక సబ్‌స్టేషన్ పరిధిలోని కొమరగిరిపట్నం, ఓడలరేవు, తుమ్మలపల్లి, మొగళ్ళమూరు గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవి కుమార్ శనివారం తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల పనుల నిమిత్తం సరఫరా నిలిపేయనున్నట్లు చెప్పారు.

నేడు పోలేరమ్మ జాతర

యానాం: స్థానిక కనకాలపేటలో కొలువైన పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఈనెల 23 ఆదివారం వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ యువజన సంఘ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన జరుగుతుందన్నారు.

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన చాంబర్ ప్రతినిధులు



మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సత్యవరప్రసాద్ తదితరులు

అమలాపురం రూరల్: ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్య వరప్రసాద్ ఆధ్వర్యంలో చాంబర్ నూతన కార్యవర్గం రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని కోరారు. దానికి మంత్రి విశ్వరూప్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో గోకరకొండ హరిబాబు, స్వామినాయుడు, నల్లా పవన్ కుమార్ వెంకటాచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భాస్కరరెడ్డి నియామకంపై హర్షం

అల్లవరం: ఏపీ భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్‌గా మండపేటకు చెందిన భాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించడంపై ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యులు జున్నూరి రామారావు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి భాస్కరరెడ్డి పార్టీలో కీలక పాత్ర పోషించారని రామారావు అన్నారు. ఈ సందర్భంగా భాస్కరరెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మల్లాడిని పరామర్శించిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



మల్లాడిని కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

యానాం: చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన మాజీ మంత్రి, ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావును ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శనివారం పరామర్శించారు. మల్లాడి ఇంటికి విచ్చేసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

తాళ్లరేవు: మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా కోరంగిలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ ప్రాంగణంలో నల్లం ఫ్యామిలీ రెస్టారెంట్‌ను శనివారం ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్తి నాణ్యత ప్రమాణాలతో ప్రజలకు ఆహార పదార్థాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ రెడ్డి సన్యాసిరావు, నల్లం శివ, రాము పాల్గొన్నారు.

వూటుకూరికి ఆంధ్రశ్రీ పురస్కారం

అమలాపురం రూరల్: రాజమహేంద్రవరం శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణ మండపంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో బండారులంకకు చెందిన కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యస్వామికి ఆంధ్రశ్రీ పురస్కారం శనివారం అందజేశారు.

ఏటిగట్టుపై బారికేడ్లు ఉంచాలి

యానాం: యానాం-కనకాలపేట గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా గతంలో ఏర్పాటుచేసిన బారికేడ్లను తిరిగి యథాస్థానంలో పెట్టాలని స్థానికులు పెద్దిరెడ్డి బాబి, కోన దేవ పోలీసులకు శనివారం విజ్ఞప్తి చేశారు. ఏటిగట్టు రహదారిపై ఇటీవల మద్యం తాగి వేగంగా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

PUBLIC NOTICE

Sri Rokkala Narasimha Swamy, S/o. Venkateswara Rao, D No 6-104/1, Telephone Exchange Road, BaloGate, Mummidivaram Mandal, Dr BR Ambedkar Konaseema Dist., applied for loan from M/s. Shriram Finance Ltd., Chennai, having branch office at Amalapuram the security of the schedule mentioned property of him. If anybody has objection or attachments or any other interests over the properties should inform to the undersigned within 7 days from this day.
Dr BR Ambedkar Konaseema Dist., Mummidivaram S R O, Mummidivaram Mandal, Mummidivaram Nagar Panchayat and village Z Dry, R S No 515/2 an extent of Eastren side ac.0.05.02 cents - 251.66 sq yds out of ac.0.18 out of full ac. 1.29 cents is bounded by E: NH 216 Road - 34'06", S: Land of Rayudu Subhashini - 58'04", W: Land of Kayluri Krishna Prasad - 47'02", N: 16 feet width road - 70 Feet in between the above boundaries with all easement rights etc., therein.

DV VS Murthy, Advocate
Date:22-04-2023 Amalapuram 98483 44577

రాత మార్చారు.. దాహార్తి తీర్చారు..

- రూ.124 కోట్లతో రక్షిత మంచి నీటి ప్రాజెక్టులు
- తాళ్ళరేవు, ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల ప్రజలకు మేలు
- ఫలించిన ఎమ్మెల్యే పొన్నాడ భగీరథ ప్రయత్నం



ఐ.పోలవరంలో నిర్మించిన మంచి నీటి ట్యాంకు



మగసానితిప్పలో మంచి నీటి కుళాయిలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ, కలెక్టర్ హిమాన్షు శుక్లా

కాట్రేనికోన: గుక్కెడు నీటి కోసం గుక్కపట్టిన గ్రామాల ప్రజలంతా ఇంటింటికీ రక్షిత నీటి సరఫరాతో పట్టరాని ఆనందానికి లోనవుతున్నారు. చుట్టూ సముద్రపు నీటితో ద్వీపాన్ని తలపిస్తూ బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న ఊర్లతో పాటు రక్షిత మంచి నీటికి నోచుకోని గ్రామాలకు సైతం దాహార్తిని తీర్చడంతో వారంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి జేజేలు పలుకుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్ళరేవు, ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లోని నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో జలజీవన్ మిషన్, ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో కలిపి రూ.124 కోట్లతో రక్షిత మంచి నీటి ప్రాజెక్టులు చేపట్టారు. పనులు పూర్తయి ఇంటింటికీ రక్షిత మంచినీరు చేరుతుండడంతో తమ గ్రామాలకు నీరివ్వడానికి భగీరథ ప్రయత్నం చేసిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పట్టు వదలకుండా ప్రయత్నం

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముమ్మిడివరం నియోజకవర్గంలోని శివారు గ్రామ ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా ముమ్మిడివరం నియోజకవర్గంలోని తాళ్ళరేవు, ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల్లో రక్షిత మంచినీటి కోసం రూ.83.65 కోట్ల జలజీవన్ మిషన్ నిధులు మంజూరయ్యాయి. మరోవైపు ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.30.70 కోట్లు మంజూరయ్యేలా చేసి రక్షిత మంచినీటి ప్రాజెక్టులు చేపట్టారు. బ్రహ్మసమేధ్యం పంచాయతీ పరిధిలోని మగసానితిప్ప గ్రామ ప్రజలు మంచినీటి కోసం బోటులపై మూడు కిలోమీటర్లు గోదావరిపాయలో ప్రయాణించి బలుసుతిప్ప నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ తెచ్చుకునేవారు. కేవలం మంచినీటి ఇబ్బందుల వల్లే గ్రామం నుంచి వందల కుటుంబాలు కాకినాడ, యానాం తదితర ప్రాంతాలకు వలసపోయాయి. గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ఎన్జీసీని ధులు రూ.75 లక్షలతో ఐ.పోలవరం మండలం గోగుళ్ళంకలో సంపు కట్టించి గోదావరి పాయలు, అటవీ ప్రాంతం మీదుగా 16 కి.మీ. దూరం పైపులైన్ పనులు చేపట్టి రక్షిత మంచి నీటిని అందించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి గ్రామంలో మంచినీటి కుళాయిలను ప్రారంభించారు.

ఒక్కొక్కటిగా పూర్తవుతున్న పనులు

కాట్రేనికోన మండలంలో రూ.5.5 కోట్లతో 16 వాటర్ ట్యాంకులు, రూ.4.5 కోట్లతో పల్లంలో పీడబ్ల్యూఎస్ ప్రాజెక్టు చెరువు, రూ.75 లక్షలతో మగసానితిప్ప పైపులైన్ల పనులు, రూ.2.6 కోట్లతో కందికుప్ప ప్రాజెక్టులో రాపిడ్ శాండ్ ఫిల్టరు (ఆర్ఎస్ఎఫ్) పనులు, ఐ.పోలవరం మండలంలో రూ.3.21 కోట్లతో 9 వాటర్ ట్యాంకులు, గుత్తినదీవిలో ప్రాజెక్టులో రూ.2.6 కోట్లతో రాపిడ్ శాండ్ ఫిల్టరు, ముమ్మిడివరంలో రూ.68 లక్షలతో రెండు వాటర్ ట్యాంకులు, తాళ్ళరేవు మండలంలో రూ.7.97 కోట్లతో 21 వాటర్ ట్యాంకులు పనులు చేశారు. మరోవైపు జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులు ప్రగతి దశలో ఉన్నాయి.

రక్షిత మంచి నీటి కోసం రూ.124 కోట్లు

ముమ్మిడివరం నియోజకవర్గ ప్రజలకు రక్షిత మంచి నీటిని అందించేందుకు సుమారు రూ.124 కోట్లు ఖర్చు చేస్తున్నాం. కందికుప్ప, గుత్తెనదీవి, తాళ్ళరేవు పీడబ్ల్యూఎస్ ప్రాజెక్టుల్లో రూ.7.80 కోట్లతో రాపిడ్ శాండ్ ఫిల్టర్లు, 104 వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నాం. సముద్ర తీరం వెంబడి ఉన్న మగసానితిప్పకు గోదావరి పాయ వెంబడి పైపులైను పనులు చేపట్టి నీరిచ్చాం.

– పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్యే

జీవితాంతం రుణపడి ఉంటాం

మా ఊరుకి రక్షిత నీరు లేక గతంలో చాలా మంది వలసపోయారు. రోజూ 3 కి.మీ. గోదావరిలో బోటులో ప్రయాణించి తెచ్చుకునేవాళ్లం. 16 కిలోమీటర్లు గోదావరిలో పైపులైన్ పనులు చేపట్టి మంచి నీరిచ్చారు. కలలో కూడా ఊహించలేదు. మాకు సాయం చేసిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పి.గంగయమ్మ, మగసానితిప్ప గ్రామం

ఘనంగా రంజాన్ వేడుకలు

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



యానాం మజీద్ ఎ కూబాలో ముస్లింల రంజాన్ ప్రార్థనలు



అల్లవరంలోని మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

అల్లవరం: పవిత్ర రంజాన్ నెల పురస్కరించుకుని అల్లవరం మసీద్‌లో రంజాన్ వేడుకలు శనివారం నిర్వహించారు. నెల పొడుపుతో రంజాన్ ఉపవాస దీక్షలు విరమించి మరుసటి రోజుని ఈద్ ఉల్ ఫితర్ నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉప్పలగుప్తం: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని విలసవిల్లి, చల్లపల్లి, ఉప్పలగుప్తం గ్రామాల్లో ముస్లిం భక్తులు మత గురువుల సమక్షంలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

యానాం: రంజాన్ సందర్భంగా స్థానిక చారిత్రక జామియా మసీదు, కోన వెంకటరత్నం నగర్‌లో మజీద్ ఎ కూబాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. స్థానిక జామియా మసీదుతో పాటు ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ఇమామ్ ఎండీ యజ్దాని రంజాన్ పర్వదిన ప్రాధాన్యతను వివరించారు. మజీద్ ఎ కూబాలో ఇమామ్ మహ్మద్ రఫీ సైతం ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం గురించి ఉద్బోధించారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శుభాకాంక్షలు తెలిపారు.

ఐ.పోలవరం: ఐ.పోలవరంలో షేక్ అక్బర్ మసీదులో బీహారీబాబు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు శనివారం ఈద్ ప్రార్థనలు చేశారు. త్యాగాలకు ప్రతీక రంజాన్ అని మత పెద్దలు అన్నారు. మురమళ్ల, కేశనకుర్రు గ్రామాల్లో ఉన్న మసీదుల్లో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ముస్లిం సోదరులకు వితరణ

అమలాపురం రూరల్: బండారులంక మసీదులో పవిత్ర రంజాన్ వేడుకల సందర్భంగా శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్ట్ ఆధ్వర్యంలో 32 మంది ముస్లింలకు బియ్యం, కిరాణా వస్తువులు, దుస్తులను మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేతుల మీదుగా అందజేశారు.

నేడు కామిశెట్టి సావిత్రి శత జయంతి

ఫ్రెంచి విముక్తి పోరాటంలో ఆమెది కీలకపాత్ర



యానాంను ఫ్రెంచి నుంచి విముక్తి చేయాలని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలిసిన కామిశెట్టి సావిత్రి (ఫైల్)

యానాం: ఫ్రెంచి విముక్తి పోరాటంలో కీలక పాత్ర పోషించిన స్వాతంత్ర్య సమరయోధురాలు కామిశెట్టి సావిత్రి శత జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 23 ఆదివారం రాజీవ్ బీచ్ వద్ద నిర్వహించనున్నారు. సావిత్రి 1923 ఏప్రిల్ 23న ఏలూరు మాజీ మున్సిపల్ చైర్మన్ రావ్‌బహుద్దూర్ బడేటి వెంకట్రామయ్య, కోటేశ్వరమ్మ దంపతులకు జన్మించారు. మద్రాసు లేడి వెల్లింగ్టన్ మహిళా కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. అనంతరం యానాంకు చెందిన పుదుచ్చేరి అసెంబ్లీ మాజీ స్పీకర్ కామిశెట్టి శ్రీపరశురామ వరప్రసాదరావు నాయుడుతో ఆమెకు వివాహం జరిగింది. 1948లో భర్త పరశురామ వరప్రసాదరావు నాయుడితో కలిసి ఫ్రెంచి వారి నుంచి యానాం విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేశారు. భారత తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో సమావేశమై యానాంను ఫ్రెంచి వారి నుంచి విముక్తి చేయాలని కోరారు. అనంతరం 1959–1964 వరకూ ఫ్రెంచి కాలంలోనే కనకాలపేట నియోజకవర్గ శాసనసభ్యురాలుగా మొట్టమొదటి మహిళా ఎమ్మెల్యేగా, పుదుచ్చేరి రాష్ట్ర పార్లమెంటరీ కార్యదర్శిగా పదవిని చేపట్టారు. అనంతరం 1964–1967 వరకూ యానాం పట్టణ ప్రథమ మహిళా మేయర్‌గా అనేక సేవలందించారు. 1985 జూన్ 21న మృతి చెందారు. ఆమె సేవలకు గుర్తింపుగా యానాం శివారు గ్రామం సావిత్రినగర్‌కు ఆమె పేరు పెట్టారు.

ట్రాఫిక్ పోలీసులకు వితరణ

అమలాపురం టౌన్: మండుటెండల్లో నిలబడి విధులు నిర్వర్తించే పట్టణ ట్రాఫిక్ పోలీసులకు సంస్కార భారతి జిల్లా శాఖ, ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్‌లు పలు రక్షణ పరికరాలు వితరణగా సమకూర్చాయి. స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆ రెండు సంస్థల ప్రతినిధులు ఆకొండి పవన్‌కుమార్, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు ట్రాఫిక్ పోలీసులకు కాటన్ టోపీ, ఒక గ్లూకోజ్ డబ్బా, నల్ల కళ్ల అద్దాలతో కూడిన కిట్లను శనివారం అందజేశారు.

మహనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచం గర్వించదగిన మహనీయుడని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని దేవర్లంకలో అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి విశ్వరూప్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ లిఖించిన రాజ్యాంగం ద్వారానే రిజర్వేషన్లు అనుభవిస్తున్నామని, ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీలు కొనుకు గౌతమి, గెద్దం సంపదరావు, పందిరి శ్రీహరి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యానాం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని దరియాలతిప్పలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పానుగుమట్ల విష్ణుమూర్తి, విద్యుత్‌శాఖ ఏఈ లంక కృష్ణారావు, విశ్రాంత సీఐ గూటం శివగణేష్ తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేడు పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం: ముమ్మిడివరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం మహిపాల చెరువు గ్రాండ్ పార్కులో ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కుడిపూడి శివన్నారాయణ, గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, వైఎస్ చైర్మన్‌గా కాశి హనుమంతరావు, డైరెక్టర్లుగా సంగాని వీర నాగేశ్వరమ్మ, ముసునూరి శ్రీలత, సవరపు లోవలక్ష్మి తదితరులు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సమావేశంలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్ తదితరులు కోరారు.

గోవధపై భజరంగదళ్, వీహెచ్‌పీల నిరసన

అమలాపురం రూరల్: అమలాపురం మార్కెట్ ప్రాంతంలో గోవధ జరుగుతోందన్న సమాచారాన్ని నిరసిస్తూ భజరంగదళ్, విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రతినిధులు స్థానిక గడియారం స్తంభం సెంటరులో, స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం ధర్నా చేశారు. మార్కెట్ ప్రాంతానికి పోలీసులను తీసుకెళ్లి ఓ ఆవు దూడను వధించిన దృశ్యాన్ని చూపించారు. దీంతో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సేవల్ని మరింత విస్తరిస్తాం

తాళ్లరేవు: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల కేంద్రంలో సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని సంస్థ ప్రతినిధి సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో జరిగిన తల్లిదండ్రుల వార్షిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు కోర్సులు పూర్తి చేసిన దివ్యాంగులకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జ్ ఎంపీ గోపాల్, ఎస్పీ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.10,116 విరాళం



అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాత గొల్ల పాపారావు దంపతులు

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు ముమ్మిడివరానికి చెందిన గొల్ల పాపారావు దంపతులు శనివారం రూ.10,116 ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ మర్యాదలతో స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటం అందజేసి సత్కరించారు.









